

అమరజవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

## అమర జవాన్‌కు నివాళి

చిన్నగూడూరు, మే 11 : మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఆదివారం వివిధ సంఘాల ఆధ్వర్యంలో అమరజవాన్ మురళీకి నివాళులర్పించారు. కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఆయా సంఘాల బాధ్యులు అనిల్, సుమన్, నవీన్ మాట్లాడుతూ.. మత విద్వేశాలను రెచ్చగొట్టి భారత్‌లో అల్లర్లు ను సృష్టించేందుకు యత్నించిన పాకిస్థాన్‌పై జరిగిన పోరాటంలో ప్రాణాలర్పించిన ము రళి సేవలు దేశ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో స్థానికులు సాంబయ్య, శ్రీకాంత్, వేణు, మధు, నాగన్న, సోమన్న, రవి, లింగయ్య పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి..

## వధూవరులకు ఎర్రబెల్లి ఆశీర్వాదం

తొర్రూరు, మే 11 : మండల కేంద్రానికి చెందిన నూనే మోహన్‌రావు కొడుకు వివాహం రామా ఉపేంద్ర గార్డెన్‌లో, వెలికట్టే గ్రామానికి చెందిన బత్తుల యాకయ్య కూతురు పెండ్లి వీఆర్ గార్డెన్స్‌లో, దొడ్డా శ్రీనివాస్ కొడుకు వివాహ స్థానికంగా జరుగగా, మాజీ మంత్రి ఎర్రబెలి దయాకర్‌రావు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

### మృతుడి కుటుంబానికి పరామర్శ

మండలంలోని కంఠాయపాలెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకురాలు, మాజీ ఎంపీటీసీ పల్లె దేవమ్మ పెద్ద కొడుకు పల్లె యాకన్న ఇటీవల తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు యాకన్న మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మాజీ జడ్పీటీసీ, జిల్లా ఫ్లోర్ లీడర్ మంగళంపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ చిన్న అంజయ్య, కో ఆప్షన్ మాజీ మెంబర్ అంకూస్ తదితరులు ఉన్నారు.



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

## బాధిత కుటుంబానికి పరామర్శ

దంతాలపల్లి, మే 11 : మండలంలోని రామానుజపురం గ్రామంలో బాధిత కుటుంబాన్ని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ పరామర్శించారు. సీనియర్ నాయకుడు పులి కృష్ణయ్య అనారోగ్యంతో మృతిచెందగా నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ధర్మారపు వేణు, యూత్ అధ్యక్షుడు కిశోర్‌కుమార్, నాయకులు మల్లారెడ్డి, లింగన్న, ఉప్పలయ్య పాల్గొన్నారు.

### వధూవరులను రెడ్యా ఆశీర్వాదం

మరిపెడ, మే 11 : మండలంలోని బాల్యాతండాకు చెందిన జర్పుల బుజ్జి, ధన్‌సింగ్ నాయక్ కొడుకు సురేశ్ వివాహ వేడుకలో ఆదివారం డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

# అడుగుకో.. గుంత

- అధ్వానంగా ఉన్న బుద్దారం రోడ్డు..
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- మరమ్మతు చేయించాలంటున్న గ్రామస్తులు

గార్ల, మే 11 : గార్ల నుంచి బుద్దారం వెళ్లే బీటీ రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గార్ల నుంచి డోర్నకల్ వెళ్లే ప్రధాన రహదారి సీతారామ కాల్వ పనులు, రైల్వే మూడో లైన్ ట్రాక్ పనుల కారణంగా నెల రోజుల క్రితం రైల్వే గేట్ మూసి వేయడంతో వాహనాలు బుద్దారం ఆర్‌యూబీ బ్రిడ్జి నుంచి బుద్దారం గ్రామం మీదగా డోర్నకల్, ఖమ్మం జిల్లాకు వెళ్తున్నాయి. ఈ క్రమంలో రోడ్డు పై అడుగుకో గుంత, కంకర రాళ్లు బయటకు తేలి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. డోర్నకల్‌కు వెళ్లే వాహనాల రాకపోకలతో రద్దీగా మారడంతో రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు పనులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. రోడ్డు ఇదే విధంగా ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు తెలిపారు.



అధ్వానంగా ఉన్న బుద్దారం గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు

# అంబేద్కర్ విగ్రహావిష్కరణలో రాజకీయం

**బీఆర్‌ఎస్ నాయకులు**

గూడూరు, మే 11 : అంబేద్కర్ విగ్రహావిష్కరణను కాంగ్రెస్ నాయకులు రాజకీయం చేశారని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు బీరవెళ్లి భరత్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత శనివారం మండల కేంద్రంలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహావిష్కరణ సమయంలో కాంగ్రెస్ నాయకులమని చెప్పుకొని తిరిగే కొంతమంది రాజకీయ లబ్ధి పొందడం కోసం నీతిమాలిన రాజకీయం చేస్తున్నారని అన్నారు. అన్నిపార్టీల నాయకుల సమన్వయంతో విగ్రహావిష్కరణ చేయాల్సిన సమయంలో తమ స్వార్థ ప్రయోజనాల కోసం, కాంగ్రెస్ పార్టీలో ఒక వర్గానికి చెందిన నాయకులు ప్రోటోకాల్ పేరు తో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యం ఇచ్చి, ఆహ్వాన పత్రికల్లో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధుల చేర్చకపోవడం, దళిత, గిరిజన సంఘాల నాయకులను కూడా ఆహ్వానించకపోవడం బాధాకరమన్నారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణలో కూడా రాజకీయం చేయడం సరైంది కాదని హితవు పలికారు. అంబేద్కర్ అందరివాడని, కాంగ్రెస్ నాయకులు మాత్రం కొందరివాడిలా చూస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ ఎండీ ఖాసీం, మాజీ వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నూకల సురేందర్, నాయకులు వాంకుడోత్ కఠార్‌సింగ్, చీదురు వెంకన్న, సంపంగి రాంచందర్, బానోత్ రామన్ననాయక్, భూక్యా సురేశ్‌నాయక్, బోడ ఎల్లయ్య, శ్రీహరి,రహీమ్, రామన్న, రాములు, భీము డు, ఎడ్ల రమేశ్, యాదగిరి, రాజారాం పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## వీరన్న సన్నిధిలో భక్తుల తాకిడి

కురవి, మే 11: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. పాఠశాలలకు సెలవులు కావడం.. రెండో శనివారం, ఆదివారం కలిసి రావడంతో సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ఎక్కువసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.. అనంతరం అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

## శ్రీనివాస్‌రెడ్డికి ఘన సన్మానం

మహబూబాబాద్ రూరల్ : ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరిలో ఆదివారం శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ప్రపంచ తెలుగు సాహితీ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సంబురాల్లో పట్టణానికి చెందిన సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి 'సింధూరము' అనే కవితాగానం చేసినందుకు కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, గజల్ సన్మానించి ప్రశంసా పత్రం, మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డికి జిల్లా శుభోదయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ కార్యవర్గ సభ్యులు అభినందనలు తెలిపారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

కేసముద్రం, మే 11 : మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కంది సుమన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబానికి చిన్ననాటి స్నేహితులు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. సుమన్ కుమార్తెలు ప్రహస్తీని, చతుర్వేని పేర్ల మీద రూ.లక్షా75వేల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. డిపాజిట్ బాండ్లను సుమన్ భార్య రాధికకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామోజ్ మహేశ్వరాచారి, మనోహర్‌రెడ్డి, అరిగె విజేందర్, సంపత్, పబ్బతి సారంగం, మధుసూదన్, నూకల వెంకన్న, పల్లి వినయ్, కంకల శ్రీనివాస్, టేకుల శ్రీకాంత్ పాల్గొన్నారు.



డిపాజిట్ బాండ్లను అందిస్తున్న స్నేహితులు



నర్సింహులపేట ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లను మేస్తున్న పశువులు

## పట్టింపు లేక.. పశువులకు మేతగా ధాన్యం

నర్సింహులపేట, మే 11: ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర, క్వింటాకు రూ.500 బోనస్ వస్తుందనే ఆశతో రైతులు కొనుగోలు కేంద్రాలకు వడ్లు తీసుకొస్తే, పట్టించుకునే వారు లేక అవి పశువుల పాలవుతున్నాయి. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రానికి దాని పరిధిలోని గ్రామాలు, తండాల రైతులు ధాన్యం తీసుకొచ్చారు. మాయిశ్చర్ వచ్చిన వడ్లను కాంటాల ఆలస్యం, అకాల వర్షాల కారణంగా మళ్లీ ఆరబెట్టాల్సి వస్తున్నది. ఏఈవోలు ధాన్యం రాశులను పరిశీలించి మాయిశ్చర్ శాతాన్ని బట్టి నంబర్లు, కూపన్లు ఇచ్చారు. ఇంత వరకు బాగానే ఉన్నా, నిర్వాహకులు ముందు తెచ్చిన వారిని కాకుండా వెనకాల వచ్చిన వారి ధాన్యాన్ని కాంటా పెడుతున్నారని, చిన్న రైతులను చిన్నచూపు చూస్తున్నారని ఆరోపిస్తున్నారు. మద్దతు ధర, బోనస్ డబ్బులకు ఆశ పడి కొనుగోలు కేంద్రాలకు పోతే ధాన్యం పశువుల పాలవుతున్నదని, నిత్యం కాపలా ఉండాల్సి వస్తున్నదన్నారు. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**గోదాం కావలెను**

★పెద్దవంగరలోని మన గ్రోమోర్ సెంటర్‌కు పర్మినెంట్ గోదాం కావలెను. 1500-2000 Sq.fts గలది పెద్దవంగర మేన్ రోడ్ పరిధిలో కావలెను. సంప్ర: 9121044072, 91001007590.

NTW-000

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

## వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

గూడూరు, మే 11 : శ్రీ లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో హనుమాన్ స్వాముల శోభాయాత్ర (నగర సంకీర్తన) వైభవంగా జరిగింది. గురుస్వామి మేరుగు మల్లయ్యస్వామి ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన హనుమాన్ మాలధారులు స్థానిక ఆంజనేస్వామి ఆలయం వద్ద పూజలు చేసి, అక్కడి నుంచి గూడూరులోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఉత్సవ విగ్రహాలను రథంపై అలంకరించి, వాడవాడలా నగర సంకీర్తన చేశారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. యాత్రలో ధ్వజ జెండాతోపాటు త్రివర్ణ పతాకాన్ని పట్టుకొని భజనలు, నృత్యం చేసుకుంటూ శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు మడిపెద్ది శ్రీనివాస్, సంపత్, దేశ్ సురేశ్, వెంకన్న, వెంకటేశ్వర్లు, మధుకర్, దేవేందర్, రవి, రవిసింగ్, వినయ్, మనోజ్, కోరె అనిల్, దయ్యాల ఉపేందర్, నాగస్వామి, అఖిల్, రమణ, శంకర్, చంద్రశేఖర్, హైందవ్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.



హనుమాన్ స్వాముల నగర సంకీర్తన

## పాకాల ఏరుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలి

గార్ల, మే 11: రాంపురంలోని పాకాల ఏరుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలని సీపీఐ నాయకులు ఆదివారం ఏటి వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. వందేళ్లుగా పాకాల ఏటి హై లెవల్ బ్రిడ్జి లేకపోవడంతో వానకాలంలో చాలా మంది తమ ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. దీక్షకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్, టీడీపీ సంఘీభావం తెలిపాయి. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కట్టెబోయిన శ్రీనివాస్, రాగం రమేశ్, జంపాల వెంకన్న, భాగం లోకేశ్, బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మణ్‌నాయక్, రమేశ్, తదితులు పాల్గొన్నారు.




పాకాలఏరు వద్ద నిరాహార దీక్ష చేస్తున్న సీపీఐ నాయకులు

## నాణ్యమైన విద్యుత్ సరఫరాకు పటిష్ట చర్యలు

బయ్యారం, మే 11 : వినియోగదారులకు నాణ్యమైన కరెంటు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాన్స్ కో సీఈవో రాజ్‌హాన్ తెలిపారు. మండలంలోని లక్ష్మీనరసింహపురం గ్రామంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో రెండు 25 కేవీ సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ నరేశ్, సింగిల్ విండో చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి, డీఈ విజయ్, ఏఈ సుమన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఈ రాజ్‌హాన్



రూప్లాతండా- నర్సింహులపేట రోడ్డు పక్కన కాలిపోతున్న చెట్లు

## మంటల్లో కాలిపోయిన చెట్లు

నర్సింహులపేట : పచ్చదనాన్ని పెంచేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. వానకాలంలో ప్రజల భాగస్వామ్యంతో ఖాళీ ప్రదేశాల్లో విరివిగా మొక్కలు నాటించింది. ప్రస్తుతం అవి పెరిగి పెద్దవికాగానే కరెంటు తీగలకు అడ్డొస్తున్నాయని విద్యుత్‌శాఖ అధికారులు నరికేస్తున్నారు.నర్సింహులపేట మండలం నుంచి నెల్లికుదురు ఆకేరువాగుకు ఇరువైపులా అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అవి విద్యుత్ తీగలకు అడ్డొస్తున్నాయని అధికారులు కొమ్మలు నరికేస్తున్నారు. రూప్లాతండా- నర్సింహులపేట రోడ్డుకు ఇరువైపులా గుర్తు తెలియని వ్యక్తులు చెట్లకు నిప్పుపెట్టడంతో కాలిపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి చెట్లు నరికివేతను ఆపాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

## అడవిపంది దాడిలో ఇద్దరికి గాయాలు

కొత్తగూడ, మే 11: అడవి పంది దాడిలో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన కొత్తగూడ మండలంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కొత్తగూడ నుంచి నర్సంపేటకు వెళ్లే గువ్వల బోడు సమీపంలో బైక్‌పై వస్తున్న వ్యక్తిపై, ఆటోలో వస్తున్న జాటోత్ లక్ష్మి(40)పై అడవిపంది దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. వారిని నర్సంపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘటనాస్థలంలో అడవి పంది మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న కొత్తగూడ మండల అటవీశాఖ అధికారి వజహత్ ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా చేశారు.

## పురుగులమందు తాగి ఒకరి ఆత్మహత్య

కురవి, మే 11 : పురుగులమందు తాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజ్)లో ఆదివారం జరిగింది. కురవి పీఎస్సై కృష్ణారెడ్డి కథనం ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన లక్ష్మణ్(34) గుండ్రాతిమడుగు(విలేజ్)కు చెందిన కల్పనతో గత కొన్ని సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. నెలరోజుల నుంచి లక్ష్మణ్ అత్తగారింటి వద్దనే ఉంటున్నాడు. కుటుంబ కలహాలతో లక్ష్మణ్ శనివారం రాత్రి పురుగులమందు తాగి రైల్వే ట్రాక్ సమీపంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద పడుకున్నాడు. కేంద్రానికి వచ్చిన రైతులు లక్ష్మణ్‌ను చూసి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి చూసే సరికి లక్ష్మణ్ మృతిచెంది ఉన్నాడు. అతడి తమ్ముడు రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లు

## డబుల్ బెడ్రూం ఇండ్ల పేరుతో అక్రమ వసూళ్లు

**ఐదుగురిపై కేసు నమోదు, సోషల్ మీడియాలో వైరల్**

చిన్నగూడూరు, మే 11 : మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం పక్కన గల ప్రభుత్వ స్థలంలో 75, మండల కేంద్రం శివారు జయ్యారం క్రాస్ రోడ్డు వద్ద 5 మొత్తం 80 డబుల్ బెడ్రూం ఇండ్లు కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తి కాక ముందే ప్రభుత్వం మారడంతో ఇండ్ల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. ఇండ్ల నిర్మాణం కోసం డబ్బులు చెల్లించిన బాధితులు ఇండ్లు తమవేనంటూ గత నెలలో ఇండ్లలోకి చొరబడగా పోలీసులు, రెవెన్యూ అధికారులు ఖాళీ చేయించారు. చొరబాటుకు కారకులైన వారిపై రెవెన్యూ అధికారులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, డబుల్ బెడ్రూం ఇండ్లు ఇప్పిస్తామంటూ ఇంటికి రూ.లక్షా70 వేలు, జయ్యారం క్రాస్‌రోడ్డు వద్ద నిర్మించిన ఇండ్లకు ఒక్కొక్కంటికి రూ.5లక్షల చొప్పున కొందరు స్థానికులు వసూళ్లకు పాల్పడినట్లు కొద్ది నెలలుగా సోషల్ మీడియాలో చర్చ జరుగుతున్నది. దీంతో పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. వారిలో మండల కేంద్రానికి చెందిన ఓ రాజకీయ పార్టీ నాయకుడు, నలుగురు విలేకర్లు ఉన్నారు. వారిలో ధారాసింగ్, అనిల్, నరేశ్, నరేందర్, శ్రీశైలం ఉన్నారు. ధారాసింగ్, అనిల్‌ను రిమాండ్‌కు తరలించగా, మిగతా ముగ్గురు పరారీలో ఉన్నట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు నిరుపేదలను గుర్తించి డబుల్ బెడ్రూం ఇండ్లు పంపిణీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ రూరల్ : తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ నుంచి లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో 60శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు మీ సేవ కేంద్రాల్లో ఈ నెల 17వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు 50 రోజుల శిక్షణ ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

## వెంటవెంటనే ధాన్యాన్ని తరలించాలి

మహబూబాబాద్ రూరల్, మే 11 : కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు అయిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించాలని జిల్లా అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి ప్రత్యేక అధికారులు, క్లస్టర్ ఇన్‌చార్జిలను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో హమాలీలు, కాంట్రాక్టర్లను సమన్వయం చేస్తూ కాంటా అయిన ధాన్యాన్ని వెంటనే తరలించాలన్నారు. అవసరమున్న చోట లారీలను సిద్ధంగా ఉంచాలని, గన్నీ బ్యాగులు కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. అధికారులు ప్రతి కొనుగోలు కేంద్రానికి నేరుగా వెళ్లి రైతుల సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించాలన్నారు. కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి ధాన్యం రవాణా, కేంద్రాల నిర్వహణలో జాప్యం లేకుండా పర్యవేక్షణ చేస్తామన్నారు.

## 13 నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

మహబూబాబాద్ రూరల్ : పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి, తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులు ఈ నెల 13 నుంచి నిర్వహించే శిక్షణకు తప్పని సరిగా హాజరు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు దశల్లో శిక్షణ ఉంటుందని, తెలంగాణ ఆదర్శ పాఠశాల, హోలీ ఏంజెల్స్, ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాల సెంటర్లలో నిర్వహిస్తామన్నారు.

## మున్నూరు కాపు సంఘం నూతన కమిటీ

మహబూబాబాద్ రూరల్ : జమాండ్లపల్లి మున్నూరు కాపు సంఘం నూతన కమిటీని ఆదివారం కాపు సంఘం పెద్దల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జమాండ్లపల్లి గ్రామ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు తోట యాదగిరి, ఉపాధ్యక్షుడు జీ రాజు, ప్రధాన కార్యదర్శి సింగంశెట్టి బాబురావు, కోశాధికారిగా కొమ్మినేని రాము, ప్రచార కార్యదర్శి తోట శ్రీనివాస్, గౌరవ సలహాదారుడు నాగేశ్వర్‌రావు, కార్యవర్గ సభ్యులుగా సురేశ్, శ్రీను, సందీప్‌ను ఎన్నుకున్నారు.

## సమ్మెను జయప్రదం చేయాలి

మరిపెడ, మే 11 : దేశవ్యాప్తంగా ఈ నెల 20న చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వ్యకాస జిల్లా నాయకులు బాణాల రాజన్న పిలుపునిచ్చారు. మండలంలోని అనేపురం గ్రామంలో ఉపాధి పనుల వద్ద ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి అధికారంలో వచ్చిన బీజేపీ ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నదని, కార్మిక సంఘాల హక్కులను హరించేలా లేబర్ కోడ్‌లను తీసుకొస్తున్నదన్నారు. 8 గంటల పని విధానాన్ని రద్దు పరిచి, 12 గంటల పని విధానం తేవడానికి చేస్తున్న కుట్రలను తిప్పికొట్టేందుకు సమ్మెలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో పఠాన్ ఇమాన్‌సాబ్, నజియా, సలీమా, రామన్న, పిచ్చమ్మ, మల్లికాంబ, జ్యోతి, సుజాత, మమత, సురేశ్ పాల్గొన్నారు.

## తాటిచెట్టు పై నుంచి పడి ఒకరి మృతి

నెల్లికుదురు : తాటిచెట్టు పై నుంచి పడి గీత కార్మికుడు మృతి చెందిన ఘటన మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ప్రభాకర్ (48) గీతవృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాడు. ఆదివారం తాటిచెట్టు ఎక్కిన ప్రభాకర్ ప్రమాదవశాత్తు మోకుజారి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

మహబూబాబాద్ రూరల్, మే 11 : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హరిత మిత్ర అవార్డు గ్రహీత, ప్రజా హృదయ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు దైద వెంకన్న అన్నారు. ఆదివారం పట్టణంలో గీసగాని కుమార్ నూతన గృహ ప్రవేశానికి హాజరై వారికి మొక్కను అందజేశారు. వెంకన్న మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి, వాటిని సంరక్షించడం అలవాటు చేసుకోవాలన్నారు. వాతావరణ కాలుష్యం విపరీతంగా పెరిగిందని, భవిష్యత్ తరాలకు ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు మొక్కలను నాటాలన్నారు.

## దురుసుగా ప్రవర్తించిన వ్యక్తి పై కేసు

మహబూబాబాద్ రూరల్ : దురుసుగా ప్రవర్తించిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై దీపిక ఆదివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. కురవి మండలం నల్లెల గ్రామానికి చెంది రాహుల్‌రెడ్డి కారులో తన ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో బలరాంతండా వద్ద పెండ్లి భరత్‌లో అదేతండాకు చెందిన ఇస్లావత్ హరి డ్యాన్స్ చేస్తూ కారును పోనివ్వకుండా అడ్డుకొని దురుసుగా ప్రవర్తించాడు. రాహుల్ ఫిర్యాదు మేరకు హరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## రైతులకు సౌకర్యాలు కల్పించాలి

చిన్నగూడూరు, మే 11 : కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని వసతులు కల్పించాలని సీపీఐ న్యూ డెమోక్రసీ తొర్రూర్ డివిజన్ కార్యదర్శి ఊగుడుల లింగన్న, అఖిల భారత రైతుకూలీ సంఘం తొర్రూరు డివిజన్ కార్యదర్శి ఇరుగు లింగన్న డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఉగ్గంపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఎడ్ల మల్లయ్య, వెంకన్న, మల్లేశ్, మంజుల, అంబరీష, వెంకన్న, ఉప్పలయ్య, రాములు, రమేశ్ ఉన్నారు.